RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

తెలంగాణ నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక 24

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | బుధవారం | 19.06.2024

సంపుటి 313 | సంచిక 1 | పేజీలు : 04 | వెల : రూ.5

## జీరో టికెట్ తో ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రి సీతక్క



**ములుగు - ప్రభాత సూర్యుడు**

ములుగు జిల్లా పర్యటన భాగంగా మంత్రి సీతక్క గారు ఈ రోజు ఏటూరు నాగారం బస్ స్టాండ్ లో మంగపేట మండల నర్సింహ సాగర్ గ్రామానికి వెళ్ళే బస్ ను పూజ చేసి ప్రారంబించి జీరో టికెట్ తో ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఆమె ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వాన్ని చాటుకుని స్ఫూర్తిగా నిలిచారు. తదనంతరం మంత్రి సీతక్క గారు జిల్లా కలెక్టర్ మరియు ఆర్టీసీ అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే ఏటూరు నాగారం మండల కేంద్రములో బస్ డిపో ఏర్పాటు మరియు ములుగు జిల్లా కేంద్రములో ఉన్న బస్ స్టాండ్ ను మోడల్ బస్ స్టాండ్ గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు అడిషనల్ కలెక్టర్ గారితో పాటు ఆర్టీసీ అధికారులకు పాల్గొన్నారు.



# వానొస్తే

02

# హైదరాబాద్

## హైదరాబాద్ నగరం పేరుకు విశ్వనగరం..వానొస్తే నరకం

**హైదరాబాద్** నగరం పేరుకు విశ్వనగరం..వానొస్తే నరకం. కొద్దిపాటి వానస్తే చాలు మెయిన్ రోడ్డలలో నీరు నిలిచిపోతుంది. దీనితో వాహనదారులు నానా యాతన పడుతున్నారు. గత ప్రభుత్వాలు ఈ సమస్యపై ఏనాడూ దృష్టి పెట్టకపోవడంతో వానాకాలంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతన్నాయి. ఇళ్లలోకి నీరు వచ్చి చేరడంతో ఖరీదైన వస్తువులన్నీ పాడైపోతున్నాయని జనం గగ్గోలు పెడుతున్నారు. అయితే తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఇకపై ఈ సమస్యలకు పరిష్కారం లభించనుంది. జీహెచ్ఎంసీ అధికారులు దీనిపై కార్యాచరణ సిద్ధం చేశారు. నెల రోజుల వ్యవధిలో దీనికి సంబంధించిన పనులను పురపాలక శాఖ ఆధ్వర్యంలో బల్దియా అధికారులు మొదలు పెట్టి పూర్తి చేయబోతున్నారు.

## కొద్దిపాటి వానలకే మెయిన్ రోడకడుల్లో నీరు నిల్వ

## గత ప్రభుత్వాల నిర్లక్యంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

వర్షాలతో చెరువులుగా మారే ప్రాంతాల్లో దానికి సమాంతరంగా పెద్ద సంపు తవ్వి అందులోకి మళ్లించే ఏర్పాటు చేయనున్నారు. ఈ సంప్ నుంచి నీటిని మోటార్లు ద్వారా సమీపంలోని అతిపెద్ద నాలాలకు తరలిస్తారు.ఏకధాటిగా 2సెం.మీ.ల వర్షం పడితే చాలు దాదాపు 50చోట్ల చెరువుల్లా మారుతున్నాయి. ఇందులో 20 వరకు ప్రధాన ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు నిలుస్తోంది. మొదటి దశలో 12 చోట్ల సంపులు నిర్మించాలని నిర్ణయించారు. పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఈ నెలాఖరుకే పనులు పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ నుంచి శంషాబాద్ వెళ్లే మార్గంలో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే కింది భాగంలో పిల్లర్ నంబర్ 264 శివరాంపల్లి దగ్గర భారీ వర్షం పడితే ఈ ప్రాంతం చెరువుగా మారుతోంది. రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా దీనికి సమీపంలోని ప్రభుత్వ స్థలంలో 1.50లక్షల లీటర్ల సామర్థ్యంతో సంపును నిర్మించనున్నారు. ఈ నీటిని వెంటవెంటనే మోటార్ల ద్వారా బుల్కాపూర్ నాలాలోకి తరలిస్తారు.హుస్సేన్‌సాగర్ చుట్టూ నీరు నిల్చే ప్రాంతాల్లోనూ ఇలాగే సంపుల నుంచి సాగర్‌లోకి పంపించనున్నారు.రాజ్‌భవన్ రోడ్డులోని లేక్ క్యూ అతిథి గృహం దగ్గర సంపును తవ్వబోతున్నారు. మొదటి దశ పనులు పూర్తయిన తరువాత రెండో దశలో మరికొన్నిచోట్ల నిర్మించాలని నిర్ణయించారు.

**సిటీలో 25 వేలకుపైగా మ్యాన్ హోల్స్**

హైదరాబాద్ లోని రహదారులు నిత్యం రద్దీగా ఉంటాయి. ప్రతీరోజూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదువుతూనే ఉంటాయి. ఇక వర్షం కురిసిందంటే కిలోమీటర్ దూరం వెళ్లాలంటే గంటల సమయం పడుతుంది. దీనికితోడు ఎక్కడ మ్యాన్ హోళ్లు ఉంటాయోనన్న ఆందోళన. పలువురు వాహనదారులు మ్యాన్ హోళ్లలో పడి మరణించిన సందర్భాలు ఉన్నాయి. అయితే, గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న లోతైన మ్యాన్ హోళ్లను ప్రజలు గుర్తించేలా జలమండలి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. అవి అత్యంత ప్రమాదకరమని చెప్పేలా వాటికి ఎరుపు రంగును అద్దుతోంది.గ్రేటర్ పరిధిలో మొత్తం 25వేలకుపైగా లోతైన మ్యాన్ హోళ్లు ఉన్నాయి. వీటిపై సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేయడంతోపాటు, వాటిని ప్రజలు తేలికగా గుర్తించేందుకు ఎరుపు రంగు పూస్తున్నారు. తద్వారా వానా కాలంలో, వర్షాలు పడిన సమయంలో మ్యాన్ హోళ్లలో పడకుండా ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు అవకాశం ఉంటుంది.

02

## ఛత్తీస్‌గఢ్ కరెంటుతో..

# 6 వేల కోట్ల భారం!



తెలంగాణ విద్యుత్తు సంస్థలపై మోయలేని

**బరువు పడిందంటున్న ప్రభుత్వ వర్గాలు**

యూనిట్ ధర రూ.3.90

## మాత్రమేనని లెక్కలు

ట్రాన్స్‌మిషన్, లైన్‌చార్జీలు

## కలిపి తడిసి మోపెడు!

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు చేయడం ద్వారా తెలంగాణ విద్యుత్తు సంస్థలపై పెనుభారం పడిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిర్ణయంతో సుమారు రూ.6 వేల కోట్ల మేర ఆర్థికభారం పడినట్లు అంచనా వేశాయి. ఒప్పందం ప్రకారం యూనిట్ ధర రూ.3.90 మాత్రమేనని చెబుతున్నప్పటికీ.. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు తెలంగాణకు చేరేటప్పటికి అయిన ఖర్చుతో కలిపి ఆ ధర భారీగా పెరిగిపోయిందని అంటున్నాయి. ఆ రాష్ట్రం నుంచి తెలంగాణ ఇప్పటి వరకు 17,996 మిలియన్ యూనిట్ల విద్యుత్తును కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.7,719 కోట్లు చెల్లించింది. అయితే ఇంకా చెల్లించాల్సిన బకాయిలు రూ.1,081 కోట్లు ఉన్నాయి. దీంతోపాటు ట్రాన్స్‌మిషన్, లైన్ చార్జీలు రూ.1,362 కోట్లు అయ్యాయి. ఇలా వీటన్నింటినీ లెక్కలోకి తీసుకుంటే ఒక్కో యూనిట్‌కు ఖర్చు రూ.5.64 వరకు అవుతోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అంటే.. విద్యుత్తు కొనుగోలు చేసిన ధర కంటే చార్జీల రూపంలోనే రూ.3,110 కోట్ల అదనపు భారం పడినట్లయిందని గుర్తు చేస్తున్నాయి. ఇదిలా ఉండగా.. బకాయిల విషయంలోనూ రెండు రాష్ట్రాల మధ్య వివాదం ఇంకా తేలలేదు. రూ.1081 కోట్ల బకాయిలున్నట్లు తెలంగాణ చెబుతుండగా.. ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు సంస్థలు మాత్రం రూ.1715 కోట్ల బకాయిలున్నట్లు లెక్క చూపుతున్నాయి. ఈ బకాయిల వివాదంపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ అప్పిలేట్ ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు కూడా చేసింది. వాస్తవానికి ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు ఏనాడూ

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి

# భారీ షాక్



- పార్టీ మారనున్న మాజీ మినిస్టర్ విడుదల రజని ?
- ఇప్పటికే అధిష్టానం అందుబాటులో లేని రజిని
- జాతీయ పార్టీ నేతలతో మంతనాలు

మిగతా 2లో...



## మల్లేపల్లి ఐటిఐలో ఏటిసీలకు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

ఐటీఐలను ఎటిసి మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్ ప్రభాత సూర్యుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మల్లేపల్లి ఐటిఐలో ఏటిసీలకు శంకుస్థాపన చేశారు. ఆధునిక పరిశ్రమల (ఇండస్ట్రీ 4.0) అవసరాలకు తగినట్లుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఎటిసి) మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఐటిఐలను ఎటిసిలుగా తీర్చిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో

మిగతా 2లో...



# 'నీట్' వివాదంపై సుప్రీం కోర్టు సీరియస్

**న్యూఢల్లీ- ప్రభాత సూర్యుడు**

వైద్య విద్యా కోర్సు ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు, పేపర్ లీకేజీ జరిగాయన్న వార్తలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.. ఎక్కడైనా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా? దానిని సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేసింది."న్యాయంగా వ్యవహరించాలి. తప్ప జరిగితే అంగీకరించాలి. ఫలానా చర్యలు తీసుకున్నాం అని వివరించాలి. కనీసం అద్దైనా మీ పనితీరుపై విశ్వాసం కలిగిస్తుంది" అని సుప్రీంకోర్టు , జాతీయ పరీక్ష మండలి( ఎన్ టిఏ)కు తెలిపింది. వైద్య విద్య ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు ఎంత కఠినంగా శ్రమిస్తారో మరచిపోకూడదని పేర్కొంది.ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన 'నీట్' పరీక్షను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్ పై న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, ఎస్ విఎన్ భట్టీలతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. సకాలంలో ఎన్ టిఏ చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# ఛత్తీస్‌గఢ్ కరెంటుతో..
# 6 వేల కోట్ల భారం!

- యూనిట్‌కు రూ.5.64 ఖర్చు అయినట్లు అంచనా
- విద్యుత్తు కారిడార్ బుకింగ్‌తో అదనపు నష్టం
- బుకింగ్‌ను రద్దు చేసుకున్నందుకూ పరిహారం
- విద్యుత్తు ఒప్పందానికి ఆమోదం తెలపని ఈఆర్సీ



**మొదటిపేజీ తరువాయి...**
సక్రమంగా సరఫరా కాలేదు. 2017 సంవత్సరం చివర్లో అందుబాటులోకి వచ్చిన ఈ విద్యుత్తు సరఫరా.. మొదలైనప్పటి నుంచీ అరకొరగానే జరిగింది. ఎన్నడూ వెయ్యి మెగావాట్లు సాఫీగా రాలేదు. ఇలా ఆశించిన సరఫరా లేకపోవడంతో తెలంగాణ డిస్కమ్‌లు తిరిగి బహిరంగ మార్కెట్లో విద్యుత్తు కొనుగోలు చేయాల్సివచ్చింది. దాంతో 2017 నుంచి 2022 వరకు విద్యుత్తు సంస్థలపై అదనంగా రూ.2083 కోట్ల భారం పడింది. 2022 ఏప్రిల్ నుంచి ఈ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

**కారిడార్ బుకింగ్‌తో అదనపు నష్టం..**
ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును తెచ్చుకునేందుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)తో వెయ్యి మెగావాట్ల విద్యుత్తు సరఫరాకు కారిడార్‌ను తెలంగాణ బుక్ చేసుకోవాల్సి వచ్చింది. ఈ కారిడార్ కూడా విద్యుత్తు సంస్థలను మరింత రుణభారంలోకి నెట్టిందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. బుకింగ్ ఒప్పందం ప్రకారం.. విద్యుత్తు తెచ్చుకున్నా, తెచ్చుకోకపోయినా పీజీసీఐఎల్‌కు సరఫరా చార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన విద్యుత్తు సరఫరా నిలిచిపోయాక కూడా రూ.638 కోట్లను అదనపు చార్జీల రూపంలో చెల్లించాల్సి వచ్చింది. వీటికితోడు గత ప్రభుత్వం కారిడార్ల బుకింగ్ విషయంలో చేసిన తప్పిదంతో మరింత నష్టం వాటిల్లిందని పేర్కొంటున్నాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు సరఫరాకు కేవలం వెయ్యి మెగావాట్ల కారిడార్ సరిపోతుండగా.. నాటి ప్రభుత్వం మరో వెయ్యి మెగావాట్ల విద్యుత్తు సరఫరాకు కూడా అడ్వాన్సుగా కారిడార్ బుక్ చేసింది. అయితే.. ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు లభించే అవకాశం లేదని ఈ కారిడార్‌ను అర్ధాంతరంగా రద్దు చేసుకుంది. కానీ, ఈలోగానే జరగాల్సిన నష్టం జరిగింది. బుక్ చేసుకున్నందుకుగాను పరిహారం కింద రూ.261 కోట్లు చెల్లించాలని పీజీసీఐఎల్.. తెలంగాణ డిస్కమ్‌లకు నోటీసులు జారీ చేసింది. అవగాహన లేకుండా చేసుకున్న కారిడార్ ఒప్పందంతోనే ఈ సమస్య తలెత్తిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందానికి తెలంగాణ ఈఆర్సీ ఇప్పటి వరకు ఆమోదముద్ర వేయలేదు. దీంతో.. ఈఆర్సీ ఆమోదం లేకుండా ఛత్తీస్‌గఢ్‌కు చెల్లించిన వేల కోట్ల రూపాయలను అడ్డదారి చెల్లింపులుగానే పరిగణించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది..



## టీచర్స్ ప్రమోషన్స్ లిస్ట్ రెడీ

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** తెలంగాణలో ఉపాధ్యాయులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పనుంది. 15 ఏళ్ల నుంచి పెండిరగ్‌లో ఉన్న ప్రమోషన్స్ ఫైల్ సిద్ధమైంది. ఆమోదించిన తర్వాత దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఏ క్షణంలోనైనా వెలువడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ముందుగా మల్టీజోన్ వన్ పరిధిలో ప్రమోషన్లు క్లియర్ చేయనున్నారు. వరంగల్ పరిధిలోని దాదాపు 10 వేల మంది ఉపాధ్యాయులకు ముందు గుడ్ న్యూస్ రానుంది. తర్వాత హైదరాబాద్ పరిధిలోని ఉపాధ్యాయులకు స్వీట్ చెప్పనుంది ప్రభుత్వం. మల్టీజోన్ వన్ పరిధిలో 19 జిల్లాలు ఉన్నాయి. అక్కడ పదివేల మందికిపై ఉపాధ్యాయులు పదోన్నతి కోసం ఎదురు చూస్తున్నారు. ఈ జీవో వస్తే దాదాపు 4900 మంది లాంగ్వేజ్ పండిట్లు, 900 మంది పీఈటీలకు ప్రమోషన లభించనుంది. ఇప్పుడు ఉన్న లాంగ్వేజ్ పండిట్లు స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ పండిట్లుగా, పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లుగా, ఎస్జీలు, స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ పొందుతారు. ఈ ప్రమోషన్ లిస్టులో ఎక్కువ మంది లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలే ఉన్నారు. మల్టీ జోన్ వన్ పరిధిలో దాదాపు ఐదు వేల మంది లాంగ్వేజ్ పండిట్లు, వెయ్యి మంది పీఈటీలు ప్రమోషన్స్ కోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది నిజామాబాద్ జిల్లా, ఖమ్మంలో జిల్లాలో ఉన్నారు. ప్రమోషన లభించిన ఉపాధ్యాయుడికి రెండు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. మొదటి జోన్ ప్రమోషన్ ప్రక్రియ పూర్తైన తర్వాత రెండో మల్టీ జోన్ పరిధి ప్రమోషన్ ఉత్తర్వులు రానున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న రెండో మల్టీజోన్‌లో 14 జిల్లాల ఉపాధ్యాయులు ప్రమోషన్స్ కోసం ఎదురు చూస్తున్నారు.

### మీ కాలుకు ముల్లు గుచ్చుకుంటే
## నా పంటితో తీస్తా
### మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** మల్కాజిగిరి ఎంపీ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడు ముందుంటానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్‌కు అభినందన కార్యక్రమాన్ని ఎఫ్‌సీఐ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఈటల మాట్లాడుతూ నా విజయాన్ని సువర్ణ అక్షరాలతో లిఖించవచ్చన్నారు. డబ్బు, మద్యాన్ని నమ్ముకున్న వారికి నా విజయం చెంపపెట్టు అన్నారు. మాట ఇచ్చినవాళ్లే గెలిపించినారని, ఓటర్లే నాకు ఓనర్లు అన్నారు. విశ్వాసం, నమ్మకం నామీద ఏవిధంగా పెట్టి గెలిపించారో అదేవిధంగా మీ కోసం కష్టపడి పనిచేస్తానన్నారు. ఎక్కడ సమస్యలున్నా పరిష్కరించడమే నా కర్తవ్యం అన్నారు. పిలుస్తే పలికే నాయకుడినని, మీ కాలుకు ముల్లు గుచ్చుకుంటే నా పంటితో తీస్తానని పేర్కొన్నారు.

### వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి
## భారీ షాక్

**అమరావతి ప్రభాత సూర్యుడు** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగలనుంది. వైఎస్సార్సీపీ మాజీ మంత్రి విడుదల రజిని పార్టీ మారనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు పార్టీ వర్గాల్లో గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికే పార్టీ అదిష్టానానికి అందుబాటు లేదని సమాచారం. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘోర పరాభవాన్ని చవిచూడడంతో, తమ రాజాకీయ మనుగడను కాపాడుకునే దిశగా పార్టీ నుండి ఒక్కొక్కరు తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే విడుదల రజిని పార్టీ మారనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిన రజిని ఒక జాతీయ పార్టీలో చేరేందుకు మంతనాలు కూడా జరుపున్నట్లు ఆమె వర్గీయుల్లో చర్చ నడుస్తోంది. అయితే జాతీయ పార్టీ అంటే.. బీజేపీనా లేక కాంగ్రెస్ పార్టీనా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్.



### ముక్కంటి సేవలో
## ఉత్తమ్ కుమార్ రెడ్డి

**శ్రీకాళహస్తి ప్రభాత సూర్యుడు** శ్రీకాళహస్తిశ్వరాలయం లో తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో విచ్చేశారు వారిని దేవస్థానం ఏ.ఈవో సతీష్ మల్లి స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించారు.అనంతరంశ్రీ మృత్యుంజయ స్వామి సన్నిధానం వద్దతెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వారిని వారి కుటుంబ సభ్యులనుదేవస్థానం అధికారులు శేష వస్త్రంతో సత్కరించి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి తీర్ధ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏ.ఈఓ సతీష్ మల్లి టెంపుల్ పి.ఆర్.ఓ నాగభూషణ్ నాయక్,రవి,శ్రీనాథ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శన్ టెంపుల్ సూపర్డెంట్ ,సి.ఎస్.ఓ నాగభూషణం యాదవ్ మరియు ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## మల్లేపల్లి ఐటిఐలో ఏటిసీలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

**మొదటిపేజీ తరువాయి...**
తెలంగాణలోని 65 ఐటిఐలనుఎటిసిలుగా అప్ గ్రేడ్ చేసేందుకురాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్లకుగానూ అవగాహన ఒప్పందం (ఎంవొయు) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఎటిసిలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐటిఐలను ప్రక్షాళన చేయాలన్నది తెలంగాణ ప్రభుత్వం నిర్ణయమన్నారు. అందులో భాగంగానే వాటిని అడ్వాన్స్ డ్ ట్రైనింగ్ సెంటర్లుగాఅప్ గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది నిరుద్యోగులున్నారు. వారి సమయాన్ని వృథా కానివ్వకూడదనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో " నేను ఇల్లు కట్టుకునే సమయంలో ఇంజనీర్ గ్రాడ్యుయేట్లు రూ. 15 వేలు లేక రూ. 20 వేలకే పనిచేస్తామన్నారు. అదే మేస్త్రీలు, నిర్మాణ రంగంలో అనుభవం ఉన్నవారిని అడిగితే రూ. 60 వేలు అడిగారు" అని వివరించారు. సర్టిఫికేట్లు జీవన స్థాయిని పెంచడం లేదని అప్పుడే అర్థమయిందన్నారు. చాలా మంది అందుకే గల్ఫ్ కు వెళుతున్నారని పేర్కొన్నారు.రాష్ట్రం నలుమూలల 65 ఐటిఐలను ఆధునీకరిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఐటిఐలను అడ్వాన్స్ డ్ అప్ గ్రేడ్ ట్రైనింగ్ సెంటర్లుగా మార్చేందుకు టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 307.96 కోట్లు కాగా, టిటిఎల్ వాటా రూ. 2016.25 కోట్లని వివరించారు. ఏటిసీల్లో శిక్షణ పొందిన వారికి టిటిఎల్ ఉద్యోగాలు కల్పిస్తుందని తెలిపారు.

- 65 ఐటీఐలను ఎటిసిలుగా అప్‌గ్రేడ్ చేస్తారు.
- ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఎటిసిల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారు.
- శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టిటిఎల్ నియమిస్తుంది.
- ఎటిసిల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల దీర్ఘ కాల (లాంగ్ టర్మ్) కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్ప కాలిక (షార్ట్ టర్మ్) కోర్సుల్లో శిక్షణ అందిస్తారు.
- గత పదేళ్లలో రాష్ట్రంలోని ఐటిఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఎటిసిలతో రానున్న పదేళ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందుతారు.
- ఐటీఐలను ఎటిసిలుగా మార్చే ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.307.96 కోట్లు (13.26 శాతం) కాగా టిటిఎల్ వాటా రూ.2016.25 కోట్లు (86.74)
- ఎటిసిలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి. అలాగే ఈ ఎటిసిలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయి.
- ఎటిసిల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టిటిఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.
- ఎటిసిలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయి



## చంద్రబాబు నిర్ణయంతో బీఆర్ఎస్ లో గుబులు

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** ఏపీ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో గులాబీ బాస్ కేసీఆర్ బెంబేలెత్తుతున్నారని పార్టీ వర్గాల అంతర్గత సమాచారం. ఆంధ్రప్రదేశ్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో తెలంగాణలోనూ పార్టీని విస్తరింపజేస్తామని చంద్రబాబు చెప్పిన సంగతి తెలిసిందే. టీడీపీని విస్తరించాలని చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకోవడంతో బీఆర్ఎస్ కు కొత్త కష్టాలు మొదలయ్యాయని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. దీంతో కేసీఆర్ కూడా వ్యూహం మార్చి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని బీసీ లేదా ఎస్సీ సామాజికవర్గం నాయకుడికి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

### డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి
## ఏపీ సచివాలయానికి పవన్



**విజయవాడ, ప్రభాత సూర్యుడు**
ఏపీ సచివాలయానికి చేరుకున్నారు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ఆయన సచివాలయానికి చేరుకున్న వెంటనే సెక్రటరీలు, పోలీసు ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. సచివాలయంలో అడుగు పెట్టిన వెంటనే పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. ఆ తరువాత సచివాలంలోని తన ఛాంబర్ ను పరిశీలించారు. ఇదిలా ఉంటే గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి అమరావతి మీదుగా సచివాలయానికి చేరుకునే మార్గం మొత్తం అభిమానులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వెంకటాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేశారు అభిమానులు. ఆయన వచ్చే మార్గం మొత్తం పూలబాట పరిచారు. దారిపొడవునా రైతులు, కూటమి నేతలు, జనసైనికులు, వీరమహిళలు పూలు జల్లుతూ స్వాగతం పలికారు. కొందరు పవన్ వీరాభిమానులు పవన్ కోసం ప్రత్యేకంగా భారీ గజమాల సిద్ధం చేశారు.ఎన్నికల ఫలితాలు విడుదలై డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన పవన్ కళ్యాణ్ తొలిసారి జూన్ 18న ఏపీ రాష్ట్ర సచివాలయానికి వెళ్లారు. అక్కడ తనకు కేటాయించిన చాంబర్ పరిశీలించారు. అక్కడి నుంచి నేరుగా సచివాలయంలోని ముఖ్యమంత్రి చంద్రబాబు ఛాంబర్ కు వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలవనున్నారు. 2017 తర్వాత పవన్ సచివాలయానికి రెండవసారి వెళ్లనున్నారు. నాడు ఉద్దానం సమస్యలపై అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయి చర్చించారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి సచివాలయానికి వెళ్లిన పవన్.. రాష్ట్ర సచివాలయంలోని బ్లాక్`2లో తనకు కేటాయించిన ఛాంబర్‌ని పవన్ పరిశీలించారు. పవన్ కళ్యాణ్ సచివాలయంలో తనకు కేటాయించిన చాంబర్‌ను పరిశీలించారు. అంతకు ముందు విజయవాడలో తన క్యాంపు కార్యాలయన్ని పరిశీలించారు. తన కార్యాలయంలోనే ఆయన మంత్రిగా బాధ్యతలను చేపట్టనున్నట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత వరుసగా సమీక్షా సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అంతకు ముందు పవన్ కల్యాణ్ ర్యాలీగా సచివాలయానికి వచ్చారు. ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సారి రావడంతో అమరావతి రైతులు ఘన స్వాగతం పలికారు. సీడ్ యాక్సెస్ రోడ్ మొత్తం పూలు చల్లుతూ స్వాగతం పలికారు. పలు చోట్ల గ్రామస్తులు ఆయనపై పూలవర్షం కురిపించారు. పవన్ కల్యాణ్ వెంట జనసేన పార్టీకి చెందిన మరో ఇద్దరు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కూడా ఉన్నారు. వారు ఇప్పటికే తమకు కేటాయించిన శాఖల బాధ్యతలను తీసుకున్నారు. పవన్ చంద్రబాబు మధ్య రాష్ట్రంలో రాజకీయంగా, పాలనా పరంగా ఎదురు కానున్న సవాళ్ల గురించి చర్చ జరిగినట్లుగా తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్ట్ సందర్శన..అక్కడి పరిస్థితుల్ని చంద్రబాబు పవన్ కళ్యాణ్‌కు వివరించారు. పోలవరం పూర్తి చేయాలంటే ఎంతో కష్టపడాల్సి ఉందని చెప్పినట్లుగా తెలుస్తోంది. మరో వైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా చర్చించు. అసెంబ్లలో ప్రతీ విభాగానికి సంబంధించిన శ్వేతపత్రం ప్రకటించాలని ఇప్పటికే నిర్ణయించారు. అప్పుల విషయంలో ఒక్క చిన్న తప్పు లేకుండా మొత్తం ప్రజల ముందు పెట్టాలని అనుకుంటున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రిగా పవన్ బాధ్యతలు స్వీకరించనున్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. అంతకంటే ముందు పవన్ కల్యాణ్‌కు జ ప్లేస్ కేటగిరి, ఎస్కార్ట్ సెక్యూరిటీ పెంచింది ప్రభుత్వం. అలాగే బులెట్ ప్రూఫ్ కారును కూడా కేటాయించింది. మొదటి సారి డిప్యూటీ సీఎం హోదాలో వస్తున్న పవన్ కళ్యాణ్‌కు భారీ మానవహారంతో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు అమరావతి రైతులు. మరోవైపు.. డిప్యూటీ సీఎం పవన్‌కు భద్రత పెంచింది ప్రభుత్వం. జ ప్లస్ సెక్యూరిటీతో పాటు..
బులెట్ ప్రూఫ్ కార్‌ను పవన్‌కు కేటాయించింది ప్రభుత్వం. బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారు పవన్. కాసేపట్లో గన్నవరం చేరుకోనున్న పవన్ కల్యాణ్ విజయవాడలో డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్ పరిశీలించనున్నారు. విజయవాడ ఇరిగేషన్ క్యాంప్ ఆఫీస్ పవన్‌కు కేటాయించారు. తర్వాత మంగళగిరి పార్టీ ఆఫీస్‌కు చేరుకోనున్నారు.

**బాధ్యతలు చేపట్టనున్న పవన్**

మధ్యాహ్నం సచివాలయానికి సచివాలయానికి చేరుకుని రెండో బ్లాక్‌లోని తన ఛాంబర్‌ను పరిశీలించనున్నారు.డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టనున్న పవన్ కల్యాణ్‌కు జ ప్లేస్ కేటగిరి, ఎసకర్ట్ సెక్యూరిటీ పెంచింది ప్రభుత్వం. అలాగే బులెట్ ప్రూఫ్ కారును కూడా కేటాయించనుంది. ఉదయం 9.45 గంటలకు హైదరాబాద్ నుంచి గన్నవరం చేసుకోనున్న పవన్..10.30 గంటల మధ్య విజయవాడలోని డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్‌కు చేరుకోనున్నారు.

RNI: TELTEL12215
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మోడీ ప్రభుత్వం మైనార్టీలో ఉందనే ప్రచారం

- ఎంపీలను కాపాడుకొనే ఎత్తు గడ
- ఆత్మ రక్షణలో కాంగ్రెస్ పార్టీ

**ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సొంతంగా తమకు 300కు పైగా సీట్లు వస్తాయని బీజేపీ ఆశించింది. కానీ ఫలితం భిన్నంగా వచ్చింది. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం బీజేపీకి రాకపోయినప్పటికీ.. ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారు.**





న్యూ డిల్లీ ప్రభాత సూర్యుడు కేంద్రంలో వరుసగా మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరింది. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టారు. ఎన్డీయే మిత్రపక్షాలకు 292 మంది ఎంపీల బలం ఉంది. బీజేపీ సొంతంగా 240 మంది ఎంపీలున్నారు. ఎన్నికలకు ముందే బీజేపీ మరికొన్ని పార్టీలతో కలిసి ఎన్డీయే కూటమిగా బరిలోకి దిగింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సొంతంగా తమకు 300కు పైగా సీట్లు వస్తాయని బీజేపీ ఆశించింది. కానీ ఫలితం భిన్నంగా వచ్చింది. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం బీజేపీకి రాకపోయినప్పటికీ.. ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారు. ప్రధానమంత్రిగా మోదీ అభ్యర్థిత్వానికి ఎన్డీయే భాగస్వామ్యపక్షాలు ఓకే చెప్పాయి. దీంతో మోదీ వరుసగా మూడోసారి ప్రధాని అయ్యారు. మరోవైపు కాంగ్రెస్ మాత్రం బీజేపీకి ప్రభుత్వ ఏర్పాటుకు సంఖ్యాబలం లేదని.. మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడం అనైతికమంటూ కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమిలోని భాగస్వామ్యపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఓ అడుగు ముందుకేసి మోదీ ప్రభుత్వం మైనార్టీలో ఉందని.. ఎప్పుడైనా కూలిపోవచ్చన్నారు. అదే సమయంలో ఈ ప్రభుత్వం కూలిపోవాలని తాము కోరుకోవడం లేదంటూ మరో వ్యాఖ్య చేశారు. వాస్తవానికి మోదీ ప్రభుత్వం మైనార్టీలో ఉందా.. తగిన సంఖ్యా బలంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిందా అనే విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదు. ఎందుకంటే ఎన్నికలకు ముందే ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ముందుకెళ్లడంతో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ సీట్లు కూటమికి వచ్చాయి. దీంతో ఎన్డీయే సర్కార్ ఏర్పడిరది. కానీ ఇండియా కూటమి విమర్శల వెనుక అసలు కారణంపై రాజకీయ విశ్లేషకులు పలు రకాల విశ్లేషణలు చేస్తున్నారు.కాంగ్రెస్ ఆరోపిస్తున్నట్లు మోదీ ప్రభుత్వం మైనార్టీలో లేదు. టీడీపీ, జేడీయూతో పాటు మరికొన్ని ఎన్డీయే భాగస్వామ్యపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు తమ మద్దతును ఉపసంహరించుకుంటే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూలిపోవడానికి అవకాశం ఉంటుంది. కానీ ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకున్న కారణంగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ఇప్పటికిప్పుడు మద్దతు ఉపసంహరించుకునే అవకాశాలు లేవని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ఎన్డీయే కూటమిలో బీజేపీకి 240 మంది ఎంపీలు ఉన్నారు. ఇండియా కూటమిలో అతిపెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు 99 మంది ఎంపీలు ఉండగా.. మహారాష్ట్రకు చెందిన కాంగ్రెస్ రెబల్ ఎంపీ ఒకరు ఆ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ బలం వందకు చేరింది. అధికారం చేపట్టాలంటే కాంగ్రెస్‌కు మరో 172 మంది ఎంపీల బలం అవసరం. ఎన్డీయే కూటమిలో ఉన్న పార్టీల మద్దతు లేకుండా కాంగ్రెస్ అధికారం చేపట్టడం కష్టం. ఇండియా కూటమి అధికారంలోకి రావాలంటే ఆ పార్టీలో ఇప్పుడున్న భాగస్వామ్య పక్షాలకు కలిపి 233 మంది ఎంపీల బలం ఉంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే మరో 39 మంది ఎంపీల మద్దతు అవసరం. టీడీపీ, జేడీయూకు చెందిన ఎంపీల సంఖ్య కలిపినా ఇండియా కూటమి సంఖ్య 261కి చేరుతుంది. ఇంకా 12 మంది ఎంపీల మద్దతు అవసరం. అంటే సుమారు మరో మూడు నుంచి నాలుగు పార్టీలకు చెందిన మద్దతు ఇండియా కూటమికి అవసరం. ఇన్ని పార్టీల కలయికతో ప్రభుత్వం ఏర్పడినా ఎన్నిరోజులు పాలన కొనసాగిస్తుందనే విషయం అనుమానేమనంటున్నారు రాజకీయ పండితులు. ఈ క్రమంలో మోదీ ప్రభుత్వానికి ప్రస్తుతం వచ్చిన నష్టం ఏమి లేదని.. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి అవసరమైన మెజార్టీ ఉందనే విషయాన్ని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.మోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. మరో ఐదేళ్లు కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉండే అవకవాశం ఉంది. దీంతో ఇండియా కూటమికి చెందిన కొందరు ఎంపీలను బీజేపీ ఆకర్షించే అవకాశం ఉందనే అనుమానంతోనే కాంగ్రెస్ నేతలు మోదీ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందని.. మైనార్టీలో ఉందనే ప్రచారం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ పార్టీతో పాటు ఇండియా కూటమిలోని పార్టీలు తమ ఎంపీలు పార్టీ మారకుండా ఉండేందుకు ఈ ప్రచారానికి కాంగ్రెస్ తెరలేపిందనే చర్చ నడుస్తోంది. తమ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు చేజారిపోకుండా ఉండేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండదని.. ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందనే ఆశ కల్పించడం ద్వారా పార్టీ నాయకులను కాపాడుకునేందుకు వేసిన ఎత్తుగడగా తెలుస్తోంది. కాంగ్రెస్ తన వ్యూహంతో ఎంపీలను కాపాడుకోగలదా లేదా అనేది భవిష్యత్తులో తేలనుంది.

# సంపాదాకీయం

## సత్వర న్యాయం జరిగేది ఎన్నడు... నేరచరితులే పాలకులైతే...

ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్యం మనది. అయితే, మన ఎన్నికల్లో అంగబలం, అర్థబలం లేనిదే పోటీ చేయటం సాధ్యమేనా? ఒకవేళ ప్రజాబలాన్ని నమ్ముకుని బరిలో దిగితే ఏమవుతుంది? వంటి ప్రశ్నలకు జవాబులేమిటో మనందరికీ స్పష్టంగా తెలుసు. ఒకప్పుడు సమాజంలో గౌరవ మర్యాదలు, సేవాభావం, నిజాయితీ ఉన్న నేతలు పావలా ఖర్చు లేకుండానే చట్టసభలకు ఎన్నికై ప్రజాసేవ చేసేవారు. కానీ, నేడు అర్థబలం, కులబలం ఉన్న నేతలో చట్టసభలకు ఎన్నిక కాగలుగుతున్నారు. తాజాగా నేర చరిత్ర కూడా అభ్యర్థి ఎంపిక విషయంలో ఒక అదనపు అర్హతగా మారుతోందేమోననే అనుమానాలు వస్తున్నాయి. హత్యలు, మానభంగాలు, వంటి తీవ్రనేరాలకు పాల్పడి, కేసులు ఎదుర్కొంటున్నవారు కూడా నిస్సంకోచంగా చట్టసభలకు పోటీచేయటమే గాక గెలిచి, మంత్రులు కావటాన్నీ నేడు మనం చూస్తున్నాం. తాజాగా జరిగిన 18 లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల నేపథ్యాలపై విడుదలైన తాజా జాతీయ నివేదికలను గమనిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతోంది. లోక్‌సభలోని 545 స్థానాలకు ఈసారి మొత్తం 8,360 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 1,333 మంది జాతీయ పార్టీల తరపున, 532 మంది ప్రాంతీయ పార్టీల నుంచి పోటీపడగా, 2,580 మంది రిజిస్టర్డ్ పార్టీల నుంచి బరిలో నిలిచారు. వీరుగాక 3,915 మంది స్వతంత్ర అభ్యర్థులు కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరిశీలించుకున్నారు. వీరిలో 8,337 మంది అఫిడవిట్లను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు పరిశీలించి ఒక నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం.. బరిలో నిలిచిన వారిలో 20 శాతం (1,643) మంది మీద క్రిమినల్ కేసులున్నాయి. వారిలో 1,190 మందిపై అత్యాచారం, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై దాడి వంటి తీవ్రమైన కేసులున్నాయి. క్రిమినల్ కేసులున్న అభ్యర్థుల సంఖ్య 2019 లోక్‌సభ ఎన్నికల్లో 1,500 కాగా ఈసారి 1,643కు పెరిగింది.పార్టీల పరంగా చూస్తే.. నేర చరిత్ర గల అభ్యర్థుల విషయంలో బీజేపీ ముందువరుసలో నిలిచింది. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన 440 మందిలో 191 మంది నేర చరితులే కాగా కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన 327 మంది అభ్యర్థుల్లో 143 మందికి నేర చరిత్ర ఉంది. బీఎస్పీ నుంచి 487 మంది పోటీ చేయగా వారిలో 63 మంది, సీపీఎం 52 మంది అభ్యర్థుల్లో 33 మందికి నేర చరిత్ర ఉంది. 3915 మంది ఇండిపెండెంట్ అభ్యర్థుల్లో 550 మంది క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్న వారే. రాష్ట్రాల వారీగా చూసినప్పుడు, ఈ జాబితాలో కేరళ ముందు వరసలో ఉంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు పోటీ చేస్తున్న నాలుగు ప్రధాన పార్టీల నుంచి మొత్తం 53 మంది బరిలో ఉంటే.. వారిలో 34 మంది నేరచరితులేనని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ)' తెలిపింది. వీరిలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి 12 మంది చొప్పున, తొమ్మిదిమంది బీఆర్ఎస్ అభ్యర్థులు, ఒక మజ్లిస్ పార్టీ అభ్యర్థి ఉన్నారు. ఆర్జేడీ, డీఎంకే, ఎస్పీ, టీఎంసీ అభ్యర్థుల్లో 40 శాతం మంది ఏదో ఒక నేరానికి పాల్పడిన వారేనని ఈ నివేదిక తెలిపింది. 2009లో గెలిచిన ఎంపీలలో 30శాతం మందికి నేర చరిత్ర ఉండగా, 2014లో ఎన్నికైన వారిలో 34 శాతం మంది మీద క్రిమినల్ రికార్డులున్నాయి. 2019 నాటికి ఇది 43 శాతానికి పెరగగా, ప్రస్తుత లోక్‌సభ ఎంపీల్లో ఏకంగా 46 శాతానికి పెరిగింది. 18వ లోక్‌సభకు ఎన్నికైన బిజెపి ఎంపీల్లో 39 శాతం మంది నేర చరిత్ర కలిగి ఉండగా, కాంగ్రెస్ ఎంపీలలో 49శాతం, టిడిపి ఎంపీల్లో 50శాతం, వైసిపి ఎంపీల్లో 25శాతం మంది నేర చరిత్ర కలిగి ఉన్నారు.చట్టసభల్లో నేరచరితులు అడుగుపెట్టకుండా ఉండాలనే ఉద్దేశంతో గతంలో తెచ్చిన ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8 (3) ప్రకారం ఒక వ్యక్తి నేరం చేసినట్లు నిర్ధారణై, రెండేళ్లకు పైబడి శిక్ష పడితే సదరు వ్యక్తి జైలు నుంచి విడుదలైన తేదీ నుంచి ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడవుతాడు. అయితే ఈ చట్టం కట్టుదిట్టంగా ఉన్నా, సత్వర న్యాయం అందని కారణంగా, వారు చేసిన నేరానికి కోర్టులు తగిన శిక్ష విధించినప్పుడే ఈ రూల్ అమలవుతోంది. కొన్ని రాష్ట్రాల్లో వీరు మంత్రులు కూడా కాగా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో హోం మంత్రులుగానూ బాధ్యతలు చేపట్టారు. ఈ దుస్థితిని ప్రస్తావిస్తూ చార్జిషీటు దాఖలైన వారిని అనర్హులుగా ప్రకటించాలని గతంలో కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే.. చట్టాలు చేయటం తన పని కాదనీ, అలాంటి చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత పార్లమెంటుదేనని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ క్రమంలోనే.. ఎంపీ, ఎమ్మెల్యేల మీదున్న క్రిమినల్ కేసుల సత్వర విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలంటూ ఏడేళ్ల కిందట సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా పరిస్థితిలో ఆశించిన మార్పేమీ రాలేదు.మనలో చాలామంది చట్టసభలలోకి నేర చరితులు అడుగుపెట్టకుండా అడ్డుకునే బాధ్యత రాజ్యాంగ సంస్థలదేనని చేతులు దులుపుకుంటున్నాం గానీ, వారికి ఓటు వేసి చట్టసభలకు పంపుతున్నది మనమేనని గుర్తించలేకపోతున్నాం. ఓటర్లకు పలు తాయిలాలు ఎరచూపి ఎలాగోలా ఎన్నికల్లో నెగ్గుతున్న నేతల కుట్రలను గమనించాకైనా జనంలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. అప్పుడే స్వచ్ఛ చరిత్రగల, సమర్థవంతులైన నేతలు చట్టసభలకు ఎన్నిక కాగలుగుతారు.

## రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలన అటక్కేకింది



- 10 రోజులుగా అపాయింట్మెంట్ దొరుకని వైనం
- ఈ ప్రభుత్వానికి చెప్పిన... గోడకు చెప్పిన ఒక్కటే
- గోడకు వినతి పత్రం అంటించాం
- బిఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలన పడకేసింది అనుకున్నాం...కానీ అటక్కేకిందని బిఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయం మీడియా పాయింట్ లో మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి పి.ఆర్ స్టంట్ మీద ఉన్న సోయి...ప్రజా సమస్యలు పరిష్కరించడంలో లేదని ఏద్దేవా చేసారు.ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు,గురుకుల టీచర్లు, ఆందోళన చేస్తుంటే పట్టింపు లేదు...రాష్ట్రంలో హత్యలు,హత్యాచారాలు జరుగుతుంటే పట్టించుకోవడం లేదన్నారు.జీవో 46 బాధితులను పట్టించుకోవడం లేదని,60 మార్కులు వచ్చిన వారికి ఉద్యోగం వస్తె...90 మార్కులు వచ్చిన వారికి ఉద్యోగం రాలేదని అన్నారు.వారికి న్యాయం చేస్తామని మాటిచ్చారు..కాంగ్రెస్ కోసం పనిచేయాలని అన్నారు..ఇప్పుడు ఎన్నికలు ఐపోగానే మొహం చాటేశారని వువిమర్శించారు.ఇప్పుడు జీవో 46 బాధితులు కాళ్ళు అరిగేలా తిరుగుతున్నారు..ప్రధాన ప్రతిపక్షమైన బి ఆర్ ఎస్ పార్టీ కేటీఆర్,హరీష్ రావు గారిని కలిశారు..వారి పక్షాన మేము సిఎస్ ను కలవడానికి వచ్చాం..10 రోజులుగా చూస్తున్నాం.. అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు..ఈ ప్రభుత్వానికి చెప్పిన...గోడకు చెప్పిన ఒక్కటే అని వినతి పత్రం సెక్రటేరియట్ గోడకు అంటించి వచ్చామన్నారు. జీవో 46 బాధితుల పక్షాన నిలుస్తున్నం..వారికి న్యాయం జరిగే వరకు మేము కొట్లడుతామన్నారు.నేను ఎమ్మెల్సీ గా ఓడిపోవచ్చు..ప్రజా క్షేత్రంలో ఉంటాం..చట్టసభల్లోలెను...జన సభల్లో ఉంటా...బాధితులు పక్షాన నిలబడతా..బి ఆర్ ఎస్ పార్టీ బాధితులకు అన్ని విధాల అండగా ఉంటుంది..వారి పక్షాన మేము పోరాటం చేస్తాంసిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వారిని ప్రజా భవన్ పిలుచుకొని,వారితో భోజనం చేసి వారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేసారు.ప్రభుత్వాలు ఉద్యమాల వల్ల చట్టాలనే వెనక్కు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి...రేవంత్ ప్రభుత్వం జీవో46 వెనక్కి తీసుకోవాలి..లేదా సవరణ చేయాలని రాకేష్ రెడ్డి డిమాండ్ చేసారు.



## బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిపై చేయిచేసుకున్న ఎసీపీ

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** బిజెపి ఎంఎల్ఎ అభ్యర్థిపై ఎసిపి చేయిచేసుకోవడం సంచలనం సృష్టించింది. ఓ హోటల్ మూసివేస్తుండగా బిజెపి నేత అమర్ సింగ్ పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పాడు. దీంతో వెంటనే అమర్ సింగ్‌పై ఎసిపి కిషన్ చేయి చేసుకున్నాడు. దీంతో అమర్ సింగ్ మద్దతుదారులు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో కార్వాన్ బిజెపి అభ్యర్థిగా కిషన్ సింగ్ పోటీ చేశారు. ప్రజాప్రతినిధులు పోలీసులతో మర్యాదగా వ్యవహరించాలని లేకపోతే ఇలానే జరుగుతుందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## ఉద్యమ కేసులు కొట్టేయండి

**- సీఎంకు రిక్వెస్ట్**

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌లపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి రిక్వెస్ట్ వచ్చింది. కేసీఆర్, బండి సంజయ్ లతో పాటు రేవంత్ రెడ్డిపై సైతం నమోదైన చిన్న చిన్న కేసులను ఉపసంహరించుకోవాలని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలంగాణ సీఎంకు లేఖ రాసింది. వీటిలో 2011 మిలియన్ మార్చిలో బీఆర్ఎస్ అధినేతపై నమోదైన కేసు ఉంది. 2009లో ఆయన చేసిన ఆమరణ నిరాహార దీక్ష సమయంలో కేసీఆర్ పై పోలీసులు నమోదు చేసిన కేసు ఇంకా పెండిరగ్ లో ఉందని లేఖలో ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై యాదాద్రి లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలోకి ప్రవేశించడంపై ఓ కేసు నమోదైంది. దాంతో పాటు బండి సంజయ్ పై నమోదైన మొత్తం 42 కేసులు కొట్టివేయాలని రిక్వెస్ట్ చేశారు. పోలీసులు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నారంటూ చేసిన కీలక ఆరోపణలపై రేవంత్ రెడ్డిపై గతంలో కేసు నమోదైంది. దాంతో పాటు కరోనా వ్యాప్తి సమయంలో కోవిడ్ ప్రోటోకాల్ ఉల్లంఘించినందుకు బండి సంజయ్ తో పాటు, రేవంత్ రెడ్డిపై నమోదైన కేసులు ఇంకా పెండిరగ్ లోనే ఉన్నాయి.

## రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి గ్రీన్ సిగ్నల్..

**అమరావతి ప్రభాత సూర్యుడు** ఏపీ శాశనమండలిలో ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి కూడా నోటిఫికేషన్ విడుదలైంది. శాశనమండలిలో ఇప్పటికే 2 ఎమ్మెల్సీ సీట్లు కాళీగా ఉన్న నేపథ్యంలో వాటి నియామకానికి చర్యలు చేపట్టారు అధికారులు. రామచంద్రయ్య, షేక్ మహ్మద్ ఇక్బాల్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. వైసీపీ నుంచి టీడీపీలోకి పార్టీ మారడంతో రామచంద్రయ్యపై ఇటీవల అనర్హతవేటు వేశారు మండలి చైర్మన్. ఇదిలా ఉంటే వైసీపీతో పాటు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన ఇక్బాల్ స్థానంలో కూడా ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు స్థానాలు ఖాళీ కావడంతో షెడ్యూల్

**విడుదల చేసిన ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ వివరాలు..ఈనెల 25న ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్**

జూలై 2 నుంచి నామినేషన్ల స్వీకరణ
జూలై 3న నామినేషన్ల పరిశీలన
జూలై 5 వరకు నామినేషన్ ఉపసంహరణకు గడువు
జూలై 12న ఉ. 9 నుంచి సా. 4వరకు పోలింగ్
జూలై 12న సాయంత్రం 5 కు ఫలితాలు

## పోలవరం దుస్థితికి చంద్రబాబే కారణం

**- అంబటి రాంబాబు**



**గుంటూరు ప్రభాత సూర్యుడు** పోలవరం ప్రాజెక్టు దుస్థితికి సీఎం చంద్రబాబే కారణమని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. 2018లోనే పోలవరం పూర్తి చేస్తామని చెప్పి ఆయన విస్మరించారని విమర్శించారు. 'జగన్ హయాంలో పోలవరం పనులు శరవేగంగా జరిగాయి. పోలవరానికి ఆయన ద్రోహం చేశారని ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాస్తోంది. మా పాలనలో ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి తప్పులు జరగలేదు. జగన్పై బురద చల్లాలని ప్రభుత్వం కుట్ర చేస్తోంది' అని ఆయన మండిపడ్డారు.

## బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలుతో రూ.2 వేల కోట్లు అదనపు భారం

### జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్ కు వివరాలు అందించిన విద్యుత్ అధికారి రఘు



**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేయడంతో రూ.2 వేల కోట్లు అదనపు భారం తెలంగాణపై పడిరదని విద్యుత్ అధికారి రఘు తెలిపారు. బిఆర్ఎకె భవన్‌లో భద్రాద్రి, యదాద్రి విద్యుత్ ప్లాంట్లు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్లపై జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్ విచారణ జరుపుతోంది. కమిషన్‌కు విద్యుత్ అధికారి రఘు వివరాలు అందించారు. కమిషన్ కార్యాలయానికి టిజెఎస్ అధ్యక్షుడు కోదండరాం కూడా వచ్చారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంఒయు చేసుకుందని, ఛత్తీస్‌గఢ్ డిస్కంలతో అప్పటి తెలంగాణ ప్రభుత్వం డిస్కంలు పిపిఎ చేసుకున్నాయని, ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న పిపిఎలకు ఇంతవరకు ఆమోదం లభించలేదని రఘు పేర్కొన్నారు.భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను నామినేషన్ పద్ధతిలో బిహెచ్ఎల్‌కు అప్పగించారని, కాంపిటేటివ్ బిడ్డింగ్ వెళ్తే ఆలస్యం అవుతుందని, నామినేషన్ పద్ధతిలో బిహెచ్ఇఎల్‌కు ఇచ్చారని, భద్రాద్రి పవర్‌ప్లాంట్‌లో ఇప్పటికే చాలా సమస్యలు వస్తున్నాయని, భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో నాణ్యత లేని యంత్రాలు ఉపయోగించారని, భద్రాద్రి పవర్‌ప్లాంట్‌ను గోదావరి ఒడ్డున నిర్మించడంతో గోదావరి వరదలు వచ్చి ప్రతీసారి ప్లాంట్ మునిగిపోతుందన్నారు. సాంకేతిక పరమైన అంశాలు దృష్టిలో పెట్టుకోకుండా భద్రాద్రి పవర్ ప్లాంట్ పెట్టారన్నారు. బొగ్గు గనులకు 280 కిలో మీటర్ల దూరంలో యాదాద్రి పవర్ ప్లాంట్ పెట్టారని, బొగ్గు గనులకు దూరంగా పెట్టడంతో రవాణా ఛార్జీలు పెరుగుతాయన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# భారత్ అమ్ముల పొదిలోకి నాగాస్త్రం



**న్యూఢిల్లీ ప్రభాత సూర్యుడు :** రక్షణ రంగంలో స్వాలంబన దిశగా కీలక ముందడుగు పడిరది. తొలిసారి స్వదేశీయంగా రూపొందించిన ఆత్మహుతి డ్రోన్ నాగాస్త్రం`1 భారత ఆర్మీ అమ్ములపొదిలో చేరింది. నాగ్ పూర్ లోని సోలార్ ఇండస్ట్రీకి చెందిన ఎకనామిక్స్ ఎక్స్ ప్లోజివ్ లిమిటెడ్ ఈఈఎల్ ఈ మానవరహిత విమానం యూఏవీ డ్రోన్లను తయారు చేసింది. చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లోని క్లిష్టమైన ప్రాంతాల్లో వాడేందుకు వీలుగా ఈ డ్రోన్లకు ఆర్డర్ ఇచ్చింది ఆర్మీ. మొత్తం 480 యూఏవీలకు ఆర్డర్ ఇవ్వగా, తొలి విడతలో 120 డ్రోన్లు సరఫరా చేశారు.కశ్మీర్ లోని పుల్గావ్ ఆయుధ డిపోకు ఈ డ్రోన్లను తరలించారు. 9 కేజీల బరువుండే ఈ పోర్టబుల్ డ్రోన్.. గాలిలో ఏకధాటిగా 30 నిమిషాలు ఎగరగలదు. 30 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాన్ని చేధించగలదు. ఒక కిలో బరువు పేలుడు పదార్థాలను మోసుకెళ్లగల సామర్థ్యం ఈ డ్రోన్ సొంతం. జీపీఎస్ ఆధారంగా పని చేసే ఈ డ్రోన్.. లక్ష్యాలపై కచ్చితత్వంతో దాడి చేస్తుంది. ఎలక్ట్రిక్ ప్రపల్షన్ సిస్టమ్ కారణంగా నాగాస్త్రం`1 తక్కువ శబ్దంతో ప్రయాణిస్తుంది. ఇది 200 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఎగిరితే శత్రువుకు దీన్ని గుర్తించడం కూడా కష్టమే. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా యుద్ధాల్లో డ్రోన్ల వినియోగం ఎక్కువైంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో పాటు అజర్ బైజాన్, అర్మీనియా వివాదం, సిరియా సంఘర్షణలు, సౌదీలోని చమురు నిక్షేపాలపై దాడులకు డ్రోన్లనే ఎక్కువగా వాడుతున్నారు. మన దేశ ఉత్తర సరిహద్దుల్లోనూ తరుచూ డ్రోన్లు ఎగురుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు మన ఆర్మీ కూడా డ్రోన్ ఆయుధాలను సమకూర్చుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఈ మానవరహిత డ్రోన్లను సమకూర్చుకుంది. వీటి ద్వారా పాక్, చైనా సరిహద్దుల్లో శత్రు మూకల కదలికలను అరికట్టవచ్చని చెబుతున్నారు.

# తెలంగాణ గవర్నర్‌గా కిరణ్ కుమార్ రెడ్డి ?



**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు :** ఈ ఎన్నికల్లో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఓడిపోయారు. రాజంపేట పార్లమెంట్ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి చేతిలో 76 వేల ఓట్లతో ఓటమి చవిచూశారు. బిజెపి నుంచి ఆరుగురు పోటీ చేయగా.. ముగ్గురుకి ఓటమి ఎదురైంది. అందులో కిరణ్ కుమార్ రెడ్డి ఒకరు. అయితే రాజంపేట నియోజకవర్గం క్రిటికల్ అని తెలిసినా కిరణ్ రంగంలోకి దిగారు. అయితే ఆయన ఓడిపోయినా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చింది. ఏపీలో కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. అటు సోదరుడు కిషోర్ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఇటువంటి తరుణంలో కిరణ్ కుమార్ రెడ్డి సేవలను వేరే విధంగా వినియోగించుకోవాలని బిజెపితో పాటు చంద్రబాబు భావిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో నల్లారి కుటుంబానికి ప్రత్యేక రాజకీయ నేపథ్యం. సుదీర్ఘకాలం ఆ కుటుంబం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగింది. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన కిరణ్ పలుసార్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెక్ చెప్పడంతో ఎప్పుడూ మంత్రి పదవి దక్కలేదు. రాజశేఖర్ రెడ్డి రెండోసారి అధికారంలోకి వచ్చిన తరుణంలో.. అనూహ్యంగా స్పీకర్ పదవి కిరణ్ కుమార్ రెడ్డికి వరించింది. 2010లో రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో రోశయ్య సీఎం అయ్యారు. కొద్ది రోజులకే ఆయనను మార్చి స్పీకర్ గా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డికి కాంగ్రెస్ హై కమాండ్ అవకాశం ఇచ్చింది. మూడేళ్ల పాటు ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా కిరణ్ వ్యవహరించారు. ఉమ్మడి ఏపీకి ఆయనే చివరి సీఎం.రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీతో విభేదించారు కిరణ్ కుమార్ రెడ్డి. సమైక్యాంధ్ర పార్టీని స్థాపించారు. 2014ఎన్నికల్లో పోటీ చేశారు. ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయారు. అయితే ఓట్లు చీల్చి వైసిపి ఓటమికి కారణమయ్యారు. అక్కడ నుంచి పొలిటికల్ గా సైలెంట్ అయ్యారు. 2019 ఎన్నికల్లో సైతం కనిపించలేదు. కానీ ఈ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరారు. కానీ ఎక్కువ రోజులు అక్కడ ఇమడ లేకపోయారు. బిజెపి హై కమాండ్ పెద్దల పిలుపు మేరకు ఆ పార్టీలో చేరారు. ఏపీలో పొత్తుల్లో భాగంగా రాజంపేట ఎంపీ స్థానం నుంచి పోటీ చేశారు. వైసీపీ అభ్యర్థి మిధున్ రెడ్డికి గట్టి పోటీ ఇచ్చారు. అయితే అటు కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావడం, ఇటు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విజయం సాధించడంతో కిరణ్ కు మంచి ఛాన్స్ ఇవ్వాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నారు. కిరణ్ విషయంలో చంద్రబాబు సైతం సుముఖంగా ఉండడంతో ఆయన పేరును గవర్నర్ పోస్ట్ కు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి రాష్ట్రంపై కిరణ్ కు మంచి పట్టు ఉంది. ప్రస్తుతం తెలంగాణ గవర్నర్ గా ఉన్న తమిళ సై తిరిగి రాజకీయాల్లో ప్రవేశించారు. తమిళనాడు రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. తెలంగాణలో బిజెపి ఎనిమిది ఎంపీ సీట్లను గెలుచుకుంది. ఈ తరుణంలో రాష్ట్రంపై సమగ్ర అవగాహన ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి గవర్నర్ అయితే బిజెపికి తప్పకుండా ప్రయోజనం చేకూరుతుంది. అందుకే కిరణ్ పేరు ఖరారు చేసినట్లు సమాచారం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# మండుతున్న కూరల ధరలు



**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు :** ఏమే.. ఓ రెండు వందలు ఇవ్వు మార్కెట్ కు వెళ్లివస్తా.. ఇంకో వంద ఎక్కువ ఇవ్వు ఏమైనా ఫ్రూట్స్ తీసుకొని వస్తాను అంటే భార్య పప్పు డబ్బాలో దాచిన డబ్బులు ఇచ్చేది. ఓ వారం మొత్తం సరిపడా కూరగాయలు వచ్చేవి. రెండు మూడు వందల్లో వారం సరిపడ కూరగాయలు వస్తే.. ఇప్పుడు రెండు రోజులకు కూడా సరిపడా కూరగాయలు వచ్చేలా లేవు. ఐదు వందలు తీసుకొని మార్కెట్ కు వెళ్తే వామ్మో ఇప్పుడే వచ్చామే అప్పుడే పర్స్ ఖాళీ అయిందా? ఇంటికి వెళ్తే నా పెళ్లం ఈ డబ్బులు నేనే ఏదో చేశాను అనుకుంటది అని భయపడే పరిస్థితి తెచ్చాయి కూరగాయలు.కాస్త చదవడానికి మీకు ఎలా అనిపించినా.. నిజంగా ఇదే కదా ప్రస్తుతం కూరగాయల వల్ల మీ పరిస్థితి. రూ. 500 తీసుకొని వెళ్తే ఐదు కూరగాయలు కూడా రావడం లేదు. టమాట రూ. 100 మిర్చి రూ. 100 ఇంకే రూ. 200 ఇక్కడే అయిపాయే. మరి మిగిలిన కూరగాయలు తీసుకొనేది ఎలా అని ముక్కున వేలు వేసుకొని వచ్చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సరైన వర్షాలు పడటం లేదు. ఇప్పటి కీ ఎండలు మండుతున్నాయి. దీనితో కూరగాయల సాగు పైనా ప్రభావం చాలా పడిరది. దీంతో కూరగాయలు మార్కెట్ లోకి తక్కువ వస్తున్నాయి.చాలా చోట్ల భూగర్భ జలాలు అడుగంటిపోయాయి గణనీయంగా కూరగాయల దిగుబడి తగ్గింది.

ప్రస్తుతం బహిరంగ మార్కెట్ లో అన్ని రకాల కూరగాయాల ధరలు నలభై శాతం పెరిగాయి.. పచ్చి మిర్చి కిలోకి వంద, చిక్కుడు కిలో కి నూట ఇరవై, క్యారెట్ వంద, కాకరకాయ తొంభై , కాలిఫ్లవర్ ఎనభై, అకుకూరలు కిలోకి డెబ్బై గా ఉంటే మార్కెట్ రూ. 500 లతో అవుతుంది అంటారా?? గతంలో మూడు వందల రూపాయల కూరగాయలు కొనుగోలు చెస్తే వారం రొజులకి సరిపడేది కదా. కానీ.. ఇప్పుడు కనీసం రెండు రోజులకి కూడ సరిపోవడం లేదు కదా..ఈధరలు మరింత పెరిగే అవకాశం వుందంటున్నారు వ్యాపారస్థులు. కొత్త పంట చేతికి వస్తే సామాన్యుడి జేబు నిండుగా ఉంటూనే కూరగాయల సంచి కూడా నిండుగా ఉంటుంది. లేదా జేబు ఖాళీనే, సంచి ఖాళీనే. మొత్తం మీద ఇప్పటికే ఎండ తీవ్రత ఉంది. దీంతో కొత్త పంట సాగు చేయడం కష్టమే. వర్షాలు కొట్టకపోతే కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం కూడా ఉంది. సో కాస్త గుండె పదిలం చేసుకోండి.

# పార్టీ ప్రక్షాళనకు గులాబీ రెడీ

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు :** రోజురోజుకూ గులాబీ పార్టీ కార్యకర్తలలో ఆందోళన పెరిగిపోతోంది. అసెంబ్లీ తర్వాత కొద్దో గొప్పో పుంజుకుంటుంది పార్టీ అని భావించిన నేతలకు జీరో ఫలితాలను చూసి జీర్ణించుకోలేకపోతున్నారు. కనీసం ఓటమికి కారణాలు కూడా విశ్లేషించుకునే పరిస్థితిలో లేని పార్టీ అగ్ర నేతల వ్యవహార శైలితో ఇక పార్టీ మార్పు తప్ప వేరే గత్యంతరం లేని పరిస్థితికి వచ్చారు. గులాబీ పార్టీ బాస్ కేసీఆర్ కూడా ఎన్నడూ లేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో పార్టీని, క్యాడర్ ని చేయిజారకుండా చూసుకోవాల్సిన బాధ్యత తనపైనే ఉంది. అందుకనే బీఆర్ఎస్ ను బతికించుకునే పనిలో ఉన్నారని సమాచారం.రెండు పర్యాయాలు తెలంగాణను ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించిన నేత కేసీఆర్. ఇన్నాళ్లూ ఆయన చెప్పిందే వేదం.. ఆయన మాటే శాసనం గా ఉండేది. ఇప్పుడు కార్యకర్తలు కనీసం కేసీఆర్ ను సైతం లెక్కచేయని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితిలో కేసీఆర్ బిగ్ స్కెచ్ వేసే పనిలో ఉన్నారు. పార్టీని బతికించుకోవాలంటే కేవలం నాయకత్వ మార్పు తప్ప వేరే దారి కనబడటం లేదు. అంటే కారు ఓనర్ కేసీఆర్ అయినా దానిని నడిపించే సమర్థుడైన డ్రైవర్ కోసం వెదికే పనిలో ఉన్నట్లు సమాచారం. అయితే కేసీఆర్ ఈ సారి పార్టీ కీలక మీటింగ్ పెట్టి తన మనసులోని ఈ నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ పండితులు అంటున్నారు.కేసీఆర్ ఒక వేళ ఇలాంటి నిర్ణయమే తీసుకుంటే కేసీఆర్ తర్వాత పార్టీని నడిపించే నాయకుడు ఎవరు కెటీఆర్ అని కొందరు, హరీష్ రావు అని మరికొందరు ఊహాగానాలు చేస్తున్నారు. అయితే ఇందుకు కేసీఆర్ సుముఖంగా లేరని తెలుస్తోంది. ఇప్పటికే కుటుంబ పార్టీగా ముద్ర వేయించుకున్న బీఆర్ఎస్ పార్టీకి ఇలాంటి నిర్ణయాలతో లాభం ఉండకపోగా నష్టం ఎక్కువగా ఉందని కేసీఆర్ భావిస్తున్నారట. ఒకప్పుడు దళితుడిని ముఖ్యమంత్రి ని చేస్తా అని చెప్పిన కేసీఆర్ తన మాట నిలబెట్టుకోకపోవడం కూడా పార్టీ ఓటమికి కారణంగా భావిస్తున్నారు. ఇప్పుడు కూడా పార్టీని తన కంట్రోల్ లోనే ఉంచుకుని కేవలం అధ్యక్ష పదవిని ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన నేతకు అప్పగించాలని భావిస్తున్నారట కేసీఆర్.అత్యధిక స్థానాల్లో క్రాస్ ఓటింగ్ చేయటం ద్వారా గులాబీ పార్టీ ఎనిమిది సీట్లలో గెలవటానికి ‘కమలానికి’ దోహదపడిరదనే అపవాదును మూటగట్టుకుంది. ఇలాంటి వైఫల్యాలన్నింటి నుంచి గట్టెక్కాలని భావించారో ఏమోగానీ?బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ ప్రక్షాళనకు నడుం బిగించారు.ఒకవేళ ఆయనకు పార్టీ పగ్గాలు అప్పజెబితే దళిత సామాజిక వర్గానికి చెందిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ప్రధాన కార్యదర్శి పదవిని అప్పగించాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. దళితుణ్ని ముఖ్యమంత్రి చేస్తానన్న ఆయన, ఆ మాటను నిలబెట్టుకోలేదన్న అపవాదు కూడా ఉంది. ఈ క్రమంలో ప్రవీణ్ కుమార్‌నే అధ్యక్ష స్థానంలో కూర్చోబెడితే ‘ఉభయ తారకం’గా ఉంటుందనే చర్చ కూడా కారు పార్టీలో జోరందుకుంది. ఈ విషయంపై కూడా కేసీఆర్ దృష్టి సారించినట్టు విశ్వసనీయ సమాచారం. ఇలా ముందుకెళితే గతంలో ఉన్న మచ్చను పోగొట్టుకోవచ్చు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను మళ్లీ దగ్గర చేసుకోవచ్చనే వ్యూహంతో కేసీఆర్ ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మండలిలో గుత్తాపై అవిశ్వాస తీర్మానం ?



**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు :** అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మరో పొలిటికల్ ఫైట్‌కు తెలంగాణ శాసన మండలి వేదికకానుందా? చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ అధిష్టానం రెడీ అవుతోందా? అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగలడంతో మండలిలో గుత్తాపై అవిశ్వాస తీర్మానం వైపు బీఆర్ఎస్ మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉంటున్న శాసన మండలి చైర్మన్ గుత్తాకు వ్యతిరేకంగా అవిశ్వాసం నెగ్గితే రాజకీయంగా పైచేయి చాటుకోవచ్చని బీఆర్ఎస్ అధిష్టానం ఉవ్విళ్లూరుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో శాసన మండలిలో తమ బలాన్ని పెంచుకునేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ కు సన్నద్ధమవుతోందన్న టాక్ వినిపిస్తోంది. మొత్తానికి మండలి చైర్మన్ గుత్తాపై బీఆర్ఎస్ పెట్టనున్న అవిశ్వాస తీర్మానం, దీన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ అనుసరించనున్న వ్యూహాలు.. తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి..శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారన్న వార్తలు రావడంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. మండలి చైర్మన్ పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం పెడితే ఆ పార్టీకి ఉన్న సంఖ్యా బలంతో తేలికగా నెగ్గుతుంది. సభలో బీఆర్ఎస్ ఆధిపత్యాన్ని గండి కొట్టేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష వైపు మొగ్గు చూపుతోంది. బీఆర్ఎస్ నుంచి 14 మంది ఎమ్మెల్సీలను చేర్చుకుంటే మండలిలో కాంగ్రెస్ సంఖ్యాబలం 20కి చేరుకుంటుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. మొత్తం మీద మండలి చైర్మన్ గుత్తాపై పెట్టానున్న అవిశ్వాస తీర్మాన రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవిశ్వాస తీర్మానాలతో అన్నింటిని కైవసం చేసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికలు విజయ దుందిభీ మోగించిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఆశించిన పెర్ఫామెన్స్ ప్రదర్శించ లేకపోయింది. మరోవైపు బీఆర్ఎస్ కు ఒక్క సీటు కూడా రాకుండా కాంగ్రెస్ ఖంగు తినిపించింది. శాసనసభలో బలం లేకపోయినా.. పెద్దల సభ శాసనమండలిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని బిఆర్ఎస్ భావిస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్, బిజెపిల వైపు గోడ దూకేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉండడం, పార్లమెంట్ ఎన్నికల టైంలో సుఖేందర్ రెడ్డి కొడుకు అమిత్ రెడ్డి కాంగ్రెస్ చేరడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది.ఉమ్మడి నల్గొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలవేళ బీఆర్ఎస్‌లోని గుత్తా అనుచరులు మొత్తం గంపగుత్తగా కాంగ్రెస్ చేరారు. తొలుత అమిత్ రెడ్డి నల్గొండ, భువనగిరి నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఆశించగా.. ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ మాజీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పెద్దలకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుఖేందర్ రెడ్డి.. కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఫైర్ అయ్యారు. కేసిఆర్ చెప్పుడు మాటలు వినడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని ఎంపీ ఎన్నికల సమయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. ఈ పరిణామాల నేపథ్యంలో సుఖేందర్ రెడ్డిని చైర్మన్ పదవి నుంచి దింపాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు పొలిటికల్ సర్కిల్స్ లో టాక్. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో నెగ్గడం ద్వారా అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేయవచ్చునే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతోందట. గుత్తాపై అవిశ్వాస తీర్మానంలో నెగ్గితే ఓ రకంగా రేవంత్ రెడ్డి దూకుడుకు చెక్ పెట్టినట్టేనని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి..తెలంగాణ శాసన మండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40 కాగా, ప్రస్తుతం రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు మినహాయిస్తే ప్రస్తుతం మండలిలో 38 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. మండలి చైర్మన్ పదవి నుంచి దింపడానికి మొత్తం సభ్యుల్లో 2/3 వంతు మెజార్టీ ఉండాలి. ప్రస్తుతం 27 మంది సభ్యులు అవిశ్వాసానానికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పక్షాన 31 మంది ఎమ్మెల్సీలు ఉన్నట్టు మండలి రికార్డులు చెప్తున్నాయి. కానీ దామోదర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ ఎమ్మెల్సీగా గెలిచారు. చైర్మన్ సుఖేందర్ రెడ్డితో కలిపితే కాంగ్రెస్ సంఖ్య ఆరుకు పెరిగింది. వీరిని మినహాయిస్తే బీఆర్ఎస్ తరపున 26 మంది ఉంటారు. ఎంఐఎంకు ఇద్దరు ఎమ్మెల్సీలు ఉండగా, బీజేపీ కి ఒకరు ఉన్నారు. టీచర్ ఎమ్మెల్సీలు ఇద్దరు ఓటింగ్ కు దూరంగా ఉండే అవకాశం ఉంది.ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి శాసనసభలో తిరుగులేని బలం ఉన్నా.. మండలిలో మాత్రం బీఆర్ఎస్ పార్టీదే పైచేయిగా ఉంది. పలు కీలక బిల్లుల ఆమోదం, ఇతర అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అడ్డంకిగా మారే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శాసనమండలిలో ‘ఆపరేషన్ ఆకర్ష కు సిద్ధమవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రాష్ట్రం ఏర్పడినపుడు శాసనసభలో బీఆర్ఎస్ కు తిరుగులేని బలం ఉన్నా.. శాసన మండలిలో మాత్రం కాంగ్రెస్‌దే ఆధిపత్యం ఉండేది. అప్పట్లో.. అధికార బీఆర్ఎస్? మండలిలోని మెజారిటీ కాంగ్రెస్ ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకుంది

# మెట్రో సాధనే మొదటి ప్రాధాన్యత



ఎంపి రఘునందన్ రావుసికింద్రాబాద్ ప్రభాత సూర్యుడు ఎంపీ అంటే మెట్రో పక్కా చేస్తా అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్ళడం జరిగింది. ఏ నమ్మకంతో నైతే ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో పార్లమెంట్ కు పంపించారో ఆ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మెట్రో సాధనే మొదటి ప్రాధాన్యత గా తీసుకొవడం జరిగిందని మెదక్ ఎంపీ రఘు నందన్ రావు స్పష్టత చేశారు.. బేగంపేట లోని మెట్రో రైల్ భవన్ కు ఎంపీ రఘు నందన్ చేరుకొని మెట్రో ఎండీ రెడ్డిని కలసి మెట్రో రైల్ మియాపూర్ నుండి పటాన్ చెరు వరకు, పటాన్ చేరు నుండి సంగారెడ్డి వరకు పొడిగింపు పనులను వెంటనే చేపట్టాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా, అదే పటాన్ చెరు, సంగారెడ్డి ప్రజలకు లాభం చేకూరే మెట్రో రైల్ లైన్ పొడిగింపు కోసం పని చేస్తానని హామిానివ్వడం జరిగిందని అదే విధంగా ఎన్నికల నోటిఫికేషన్ కన్నా ముందే బీజేపీ ఆద్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు కూడా పెద్ద ఎత్తున ధర్నా చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. మెట్రో లైన్ పొడిగింపు కోసం ప్రతి నెల అధికారులతో టచ్ లో ఉంటానని వెల్లడిరచారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసు
# మరో మలుపు

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు:** తెలంగాణలోకొన్ని రోజుల నుంచి రాజకీయ దుమారం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. ఇప్పుడు ఇందులో ఓ ఐటీ కంపెనీ కూడా భాగం ఉందనే అనుమానం కలుగుతోంది. తాజాగా ఆ సంస్థలో సోదాలు చేయడం కూడా సంచలనంగా మారుతోంది. ఫోన్ టాపింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఎస్ఐబికి టెక్నికల్ సపోర్టు అందిస్తున్న ఇన్నోవేషన్ ల్యాబ్ లో సిట్ అధికారులు సోదాలు చేశారు. కీలకమైన డాక్యుమెంట్స్, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. హార్డ్ డిస్క్ లు సీజ్ చేశారు. మూడు సర్వర్లు, ఐదు మినీ డివైసెస్ తోపాటు హార్డ్ డిస్క్ లు సిట్ అధికారులు తమతో తీసుకెళ్లారు. కొన్నేళ్ల నుంచి ఎస్ఐబీకి టెక్నికల్ సపోర్టు ఇస్తున్న ఇన్నోవేషన్ ల్యాబ్ ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరుక్కుంది. దీంతో ఆ సంస్థ యాక్టివిటీస్ పై సిట్ అధికారులు ఫోకస్ పెట్టారు. ఈ ఉదయం ఇన్నోవేషన్ ల్యాబ్ చైర్మన్ రవి కుమార్ ఇల్లు కార్యాలయంలో సోదాలు చేపట్టారు. ఈ సంస్థ బెంగళూరు, హైదరాబాద్ లో ఆఫీస్ లు నిర్వహిస్తోంది. రెండు ప్రాంతాల్లోని ఆఫీసుల్లో కూడా తనిఖీలు చేపట్టారు. బెంగళూరు హైదరాబాద్ ఆఫీసుల్లో తనిఖీలు చేపట్టిన సిట్ బృందాలు అక్కడ సిబ్బందితో కూడా మాట్లాడారు. వారి స్టేట్ మెంట్ ను రికార్డు చేసుకున్నారు. కీలక పత్రాలు, హార్డ్ డిస్కలు, సర్వర్ లను స్వాధీనం చేసుకున్నారు. రవికుమార్ ఇంట్లో దాచిపెట్టిన హార్డ్ డిస్క్ లను కూడా పోలీసులు తీసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్లో కీలక సూత్రధారిగా భావిస్తున్న ప్రణీత్రావు? ఈ ల్యాబ్ సహాయంతోనే ప్రతిపక్షాలను ట్రాప్ చేశారని అంటున్నారు. ఎస్ఐబీకి టెక్నికల్ సపోర్ట్ అని చెబుతున్నా? చేసేది మాత్రం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమే అని సిట్ అధికారులు అనుమానిస్తున్నారు.

# పోలీసులకి ఎంపీ రఘునందన్ వార్నింగ్

**మెదక్ ప్రభాత సూర్యుడు :** మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ఐజీ రంగనాథ్ కి బిజెపి నాయకుల చేతిలో గతంలో శృంగభంగం అయ్యింది. కరీంనగర్, వరంగల్ లో మీరు అత్యుత్సహం చూపెట్టారు. మహిళ ఏఎస్ఐ ని బూతులు తిట్టిన వారిని కూడా ఎం చేయక పోవడం సిగ్గుచేటు. గత రెండు రోజుల క్రితం జరిగిన మెదక్ ఘటన లో విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి. తప్పుడు పనులు చేసిన పోలీసులను కూడా శ్రీ కృష్ణ జన్మస్థలానికి పంపుతాం. ఫోన్ ట్యాపింగ్ లో పోలీసులకి ఏ గతి పట్టిందో మెదక్ పోలీసులకు అదే గతి పడుతోందని హెచ్చరించారు.



# తెలంగాణకు నీట్‌తో లాభమా, నష్టమా తేల్చాలి

**మాజీ ఎంపి వినోద్ కమార్**

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** తెలంగాణకు నీట్‌తో లాభమా, నష్టమా తేల్చాల్సిన అవసరం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఉందని మాజీ ఎంపి వినోద్ కమార్ తెలిపారు. ఈ అంశంపై నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల వారీగా నీట్ పరీక్ష నిర్వహించాలని తమిళనాడులో విద్యార్థులు ధర్నా చేస్తున్నారని, అదే బాటలో మన ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నపత్రం లీకేజ్ అంశంలో కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయని, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై ఇడి ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి చాలా మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తున్నారని, కానీ 15 శాతం మంది మాత్రమే ఆల్ ఇండియా కోటాకు పోతున్నారని వివరించారు. నీట్ పరీక్షలో సీటు వచ్చిన ఇతర రాష్ట్రాలకు మన పిల్లలు వెళ్లడం లేదన్నారు. తెలంగాణలో 25 మెడికల్ కాలేజీలు ఉన్నాయని, మరిన్ని మెడికల్ కాలేజీలు వచ్చే అవకాశం ఉందని వినోద్ తెలిపారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.783/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR501 505, RANGAREDDY DIST/ HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.783/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215